## 13న మేడిగడ్డకు సీఎం రేవంత్ రెడ్డి

మహదేవపూర్, ఫిబ్రవరి 10: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి వద్ద ఉన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన లక్ష్మీ(మేడిగడ్డ) బరాజ్‌ను ఈ నెల 13న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 50 మంది ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించనున్నారు. బరాజ్‌ను స్వయంగా పరిశీలించేందుకు సుమారు 40 బస్సుల్లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రానున్నారు. బరాజ్‌ను పరిశీలించిన అనంతరం అక్కడే అధికారులతో సమీక్షించనున్నారు. ఈ సందర్భంగా బరాజ్ వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు.

*రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు పెద్దగా ప్రాధాన్యం దక్కలేదు. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ప్రత్యేకంగా కొత్తవేమీ మంజూరు కాలేదు. వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ములుగు, నర్సంపేటలో మెడికల్ కాలేజీ పనులను పూర్తి చేస్తామని, నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.*
*- వరంగల్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

# అంతంతే!

## ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు దక్కని ప్రాధాన్యం

- ఆరు గ్యారెంటీల అమలుపై కొరవడిన స్పష్టత
- 'పీఎం మిత్ర'తో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అనుసంధానం
- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను పూర్తిచేస్తామని ప్రకటన
- మేడారం జాతరకు రూ.110కోట్లు

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో రైతు భరోసా, రూ.500 గ్యాస్ సిలిండర్, మహిళలకు భృతి, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు పథకాలను ఎప్పటి నుంచి అమలు చేస్తామనేది స్పష్టంగా చెప్పలేదు. వరంగల్ జిల్లాలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన దేశంలోనే అతి పెద్ద వస్త్ర ఉత్పత్తి కేంద్రంగా ఉండే కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును రాష్ట్ర ప్రభుత్వ నిధులతోపాటు ప్రధానమంత్రి మిత్ర పథకంతో అనుసంధానం చేసి పూర్తి చేస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా రెండు లెదర్ పార్కులను ఏర్పాటు చేస్తామని ప్రస్తావించినా కచ్చితంగా ఎక్కడ అనేది స్పష్టం చేయలేదు. గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో రెండు ఎంబీఏ కాలేజీలను ప్రారంభించనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఏ జిల్లాలో వీటిని ఏర్పాటు చేస్తారనే విషయాన్ని ప్రస్తావించలేదు. ప్రతి మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అతి పెద్ద గిరిజన ఉత్సవంగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతర ఏర్పాట్ల కోసం రూ.110 కోట్లు విడుదల చేసినట్లు బడ్జెట్‌లో ప్రస్తావించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. సాగునీటి శాఖకు సంబంధించి శ్రీరాంసాగర్ వరద కాలువ, దేవాదుల, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. యువతకు ఉపాధి కల్పన అవకాశాలు పెంచేందుకు వీలుగా ప్రభుత్వ ఐటీఐలను ప్రైవేటు సంస్థలతో అనుసంధానం చేయనున్నట్లు పేర్కొంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఐటీఐలకు ఇది ఉపయోగపడనున్నది. కేసీఆర్ ప్రభుత్వం వరంగల్ నగరంలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను, ములుగు, నర్సంపేటలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీల పనులను పూర్తి చేస్తామని ప్రభుత్వం పేర్కొన్నది.

### కేటాయింపులు తక్కువే

పోచమ్మమైదాన్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గృహ నిర్మాణం, డబుల్ బెడ్ రూం ఇండ్ల ప్రస్తావన రాలేదు. విద్య, ఉద్యోగాల కల్పన, పరిశ్రమలకు ప్రోత్సాహకం కోసం అధిక నిధుల కేటాయించాల్సి ఉండేది. నిరుద్యోగ భృతి, ఉపాధి కల్పనకు అధిక నిధులు కేటాయించాలి. వ్యవసాయం, నీటి పారుదల, విద్యుత్, విద్యా రంగాలకు అధిక మొత్తంలో కేటాయింపులు ఉంటే ఆమోదయోగ్యంగా ఉండేది.

– త్రిపురనేని గోపీచంద్, చార్టెర్డ్ అకౌంటెంట్

### దివ్యాంగులపై చిన్నచూపు

జనగామ(నమస్తే తెలంగాణ) : ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి నిధుల ప్రస్తావనే లేదు. రూ.2,75,891కోట్ల బడ్జెట్లో పైసా కేటాయించలే. 2016 దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం బడ్జెట్‌లో 5 శాతం నిధులు కేటాయించాల్సి ఉంది. ఆ లెక్కన బడ్జెట్‌లో రూ.13,794.55 కోట్లు పెట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్తుతున్న ఆసరా పింఛన్లకు బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదు?, డిసెంబర్ నుంచే పెంచిన పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పి బడ్జెట్‌లో మొండిచెయ్యి చూపారు. రాష్ట్రంలో 40 లక్షల మంది ఉన్న దివ్యాంగుల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనే దానికి బడ్జెట్ ప్రసంగమే సాక్ష్యం. ప్రజాపాలనలో ఆసరా పింఛన్ల కోసం 24 లక్షల దరఖాస్తులు వచ్చాయని ప్రభుత్వం ప్రకటించిందని, బడ్జెట్‌లో ఒక్క రూపాయి ఇవ్వకుండా ఎలా మంజూరు చేస్తారో చెప్పలేదు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పౌష్టికాహారం అందిస్తామని చెప్పిన దానికీ అతీగతీ లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.

– తల్లి దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు శంకర్, యాదగిరి

### పీఆర్సీ ప్రస్తావన లేకపోవడం విచారకరం

శాయంపేట: ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉద్యోగుల పీఆర్సీ ప్రస్తావన లేకపోవడం విచారకరం. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు నెలల్లోనే పీఆర్సీ అమలు చేస్తామని చెప్పినా బడ్జెట్లో దాని ఊసే లేదు. బడ్జెట్లో నిధులు కేటాయించి ఈ ఆర్థిక సంవత్సరం పీఆర్సీ అమలు చేయాలి. అయితే విద్యారంగానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయింపు పెంచడం హర్షణీయం. ప్రతి మండలానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో విద్యారంగానికి ప్రాధాన్యత ఇచ్చింది. గురుకుల భవనాలకు నిధులు కేటాయించడం సానుకూల అంశం.

– రాజు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

### విద్యారంగానికి అన్యాయం

బయ్యారం: బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం జరిగింది. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలంటే బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలి. ప్రస్తుత రూ. 2.75 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ. 21, 300 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయం. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలి.

– గంగావత్ శ్రీనివాస్‌నాయక్, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి

## నల్లగొండ సభకు 20 వేల మంది..

### బీఆర్ఎస్ బహిరంగ సభ కోసం ఉమ్మడి వరంగల్ నుంచి జన సమీకరణ

### ప్రతి నియోజకవర్గం నుంచి తరలించేందుకు ఏర్పాట్లు



వరంగల్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్ఎంబీ)కి మన రాష్ట్రంలోని ప్రాజెక్టులను అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నెల 13న నల్లగొండలో బీఆర్ఎస్ తలపెట్టిన బహిరంగసభకు ఉమ్మడి జిల్లా నుంచి 20 వేల మందిని తరలి వెళ్లేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలంగాణ సాగునీటి ప్రయోజనాల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేస్తూ బీఆర్ఎస్ ఈ బహిరంగసభను నిర్వహిస్తున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, ముఖ్యనాయకులు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులు, ముఖ్యనేతలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాగునీటి రంగంలో తెలంగాణకు అన్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నల్లగొండ బహిరంగసభకు జన సమీకరణ చేయాలని ఆదేశించారు. నల్లగొండ ఉమ్మడి జిల్లా సరిహద్దులో ఉన్న పాలకుర్తి, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల నుంచి ఎక్కువ మంది, మిగిలిన నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు, ముఖ్య నేతలు సభకు తరలివెళ్లేలా వరంగల్ జిల్లాలోని బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్, మాలోత్ కవిత, గండ్ర జ్యోతి, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో జనాన్ని తరలించనున్నారు.

### సభకు భారీగా తరలిరావాలి: మాజీ మంత్రి ఎర్రబెల్లి

నల్లగొండలో బీఆర్ఎస్ నిర్వహించనున్న బహిరంగ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి భారీ సంఖ్యలో జనం తరలి రావాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా నుంచి 20 వేల మంది వరకు వెళ్లనున్నారని చెప్పారు. పాలకుర్తి, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల నుంచి నాలుగు వేల మంది చొప్పున, మిగిలిన నియోజకవర్గాల నుంచి వెయ్యి మందికి తగ్గకుండా ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు, ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు.

*అడిషనల్ కలెక్టర్ వాహనాన్ని అడ్డుకున్న వ్యాపారులు*

## మేడారంలో చిరు వ్యాపారులపై జులుం

### అదనపు కలెక్టర్ అత్యుత్సాహం.. షాపుల కూల్చివేత.. ఆందోళన చేసిన వ్యాపారులు, ఆదివాసీలు

తాడ్వాయి, ఫిబ్రవరి 10 : మేడారంలో ఆదివాసీ చిరు వ్యాపారులపై అదనపు కలెక్టర్ శ్రీజ అత్యుత్సాహం ప్రదర్శించారు. గద్దెల సమీపంలోని రోడ్లకు ఇరువైపులా ఉన్న షాపులను శుక్రవారం రాత్రి జేసీబీ సాయంతో కూల్చివేయించారు. వివరాలిలా ఉన్నాయి.. మహా జాతర సందర్భంగా గద్దెల సమీపంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఆదివాసీలు షాపులు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. జాతర దగ్గర పడుతున్నందున రోడ్లకు ఇరువైపులా ఉన్న షాపులను తొలగించాలని అధికారులు నోటీసులు ఇచ్చారు. దీంతో వారు శుక్రవారం సరుకులను ఖాళీ చేశారు. రాత్రి కావడంతో రేకులను శనివారం ఉదయమే తొలగిస్తామని పంచాయతీ అధికారులకు విన్నవించగా వారు ఒప్పుకున్నారు. కాగా, అదనపు కలెక్టర్ రాత్రి మేడారం చేరుకొని జేసీబీలు, వంద మంది పారిశుధ్య కార్మికులు, 50 మంది పోలీసులను వెంటబెట్టుకుని వ్యాపారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేతలు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఆదివాసీ వ్యాపారులు అక్కడికి చేరుకుని షాపులను కూల్చవద్దని విన్నవించినా వినలేదు. రేకులు, బొంగులు, సిమెంట్ పోల్స్‌ను ధ్వంసం చేశారు. ఆగ్రహించిన వ్యాపారులు వాగ్వాదానికి దిగారు. అయినా వినకుండా అలాగే కూల్చివేతలు చేస్తుండడంతో ఆగ్రహించిన ఆదివాసీ వ్యాపారులు ఆందోళనకు దిగారు. దీంతో కూల్చివేతలు నిలిపివేసి వెళ్తుండగా తమకు న్యాయం చేయాలని కారును అడ్డుకున్నారు. ఇటీవల వచ్చిన వరదల వల్ల తీవ్రంగా నష్టపోయామని, ఇప్పుడు మీవల్ల మరింత నష్టపోయామని తమకు న్యాయం చేసే వరకు ఆందోళన విరమించమని భీష్మించారు. ఏఎస్పీ సంకీర్త్ ఎంత చెప్పినా వినని వ్యాపారులు సీతక్క డౌన్‌డౌన్, పోలీసులు డౌన్‌డౌన్, కలెక్టర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. పరిస్థితి చేయిదాటే అవకాశం ఉండడంతో పోలీస్ అధికారులు ఎస్పీ శబరీష్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆయన మేడారానికి చేరుకొని వ్యాపారులు, పూజారుల సంఘం అధ్యక్షుడితో మాట్లాడారు. బాధితులను సముదాయించి నష్టాన్ని పూడుస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. శనివారం మేడారం చేరుకున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి 'మేడారంలో అడిషనల్ కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించమని, తప్పు జరిగింది, క్షమించాలని' వ్యాపారులు, పూజారులను కోరినట్లు సమాచారం.

*అధ్యాపకుల వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఆర్‌సీవో ఆగస్టీన్*

## తీరు మారకుంటే చర్యలు తప్పవు

### సిబ్బందిని హెచ్చరించిన ఇన్‌చార్జి ఆర్‌సీవో ఆగస్టీన్

### 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన..

### ఏకలవ్య పాఠశాల సందర్శన

బయ్యారం, ఫిబ్రవరి 10 : విద్యార్థులకందించే మెనూ విషయంలో తీరు మారకుంటే చర్యలు తప్పవని ఏకలవ్య పాఠశాల సిబ్బందిని ఇన్‌చార్జి ఆర్‌సీవో ఆగస్టీన్ హెచ్చరించారు. మండలంలోని నామాలపాడు ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదని శుక్రవారం 'అమలు కాని మెనూ.. సరిపోని టిఫిన్' అనే శీర్షికతో నమస్తే తెలంగాణ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఉన్నతాధికారుల ఆదేశంతో శనివారం ఏకలవ్య పాఠశాలను ఆర్‌సీవో సందర్శించారు. కిచెన్, డైనింగ్‌హాల్‌ను పరిశీలించారు. మెనూను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటలను రుచి చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక నుంచి విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు రోజుల్లో మళ్లీ వస్తానని, తీరు మారకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మెనూ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యులనుంచి లిఖిత పూర్వకంగా వివరణ తీసుకోవాలని ప్రిన్సిపాల్ రవిబాబును ఆదేశించారు. అదేవిధంగా ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి కూడా ఏకలవ్య పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి కిచిడి తిని, నాణ్యత లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

## రెవెన్యూ మాయాజాలం

### ఒకరి భూమి మరొకరి పేరున మార్చిన అధికారులు

### తహసీల్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు

*విజయలక్ష్మి పేరుతో ఉన్న పాస్ పుస్తకం*

వెంకటాపురం (నూగూరు), ఫిబ్రవరి 10 : రెవెన్యూ అధికారులు, సిబ్బంది మళ్లీ తమ చేతివాటం చూపిస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి కొంత మంది ఒకరి భూమిని మరొకరిపై ఎక్కిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని వీరభద్రవరం గ్రామానికి చెందిన తవిడి శెట్టి విజయలక్ష్మికి వారసత్వంగా సంక్రమించిన పట్టా భూమి ఉంది. వీరభద్రవరం (జెడ్)లోని 12.13 ఎకరాల భూమికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నాయి. కాగా, భూ యజమానులు స్థానికంగా లేకపోవటంతో ఇదే అదనుగా భావించిన ఓ వ్యక్తి రెవెన్యూ సిబ్బంది, గతంలో పనిచేసిన అధికారులతో కలిసి వారసత్వం పేరుతో తన పేరున మార్చుకున్నట్లు సమాచారం. కాగా, విజయలక్ష్మికి రైతుబంధు డబ్బులు ఖాతాలో పడకపోడంతో అనుమానం వచ్చి ఆన్‌లైన్‌లో పరిశీలించగా భూమి వేరొకరి పేరున ఉన్నట్లు గుర్తించింది. ఇటీవల తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై తహసీల్దార్ సర్వర్‌ను వివరణ కోరగా భూ మార్పిడిపై బాధితుల నుంచి ఫిర్యాదు వచ్చిందని, విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

## వరంగల్ అడిషనల్ కలెక్టర్‌గా ఆదిలక్ష్మి

### భారీగా తహసీల్దార్ల బదిలీలు

### ఆర్డీవో ఆఫీసు ఉద్యోగి మక్బూల్‌పై చర్యలకు ప్రతిపాదనలు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 10: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పలువురు డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లను బదిలీ చేసింది. వరంగల్ రెవెన్యూ అడిషనల్ కలెక్టర్‌గా వెయిటింగ్‌లో ఉన్న కే ఆదిలక్ష్మిని, కరీంనగర్‌లో భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న పి.సదానందంను వరంగల్, హనుమకొండ జిల్లాల భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్‌గా, వరంగల్, హనుమకొండ జిల్లాల భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న పి.కిరణ్‌ప్రకాశ్‌ను కరీంనగర్ భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది. మల్టీజోన్-1, మల్టీజోన్-2లో పనిచేస్తున్న పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ చీఫ్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. హనుమకొండ జిల్లాలో పనిచేస్తున్న జి.గౌరీశంకర్ ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు. హనుమకొండ ఆర్డీవో ఆఫీసులో పనిచేస్తున్న ఎండీ మక్బూల్‌పై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ చీఫ్ కమిషనర్‌కు కలెక్టర్ నివేదిక పంపారు. దీంతో మక్బూల్‌ను హైదరాబాద్‌లోని రెవెన్యూ చీఫ్ కమిషనర్ కార్యాలయానికి అటాచ్ చేశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పనిచేస్తున్న కె.శ్రీపాల్ హనుమకొండ జిల్లాకు, పి.ప్రహ్లాద్ భూపాలపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పనిచేస్తున్న ఎల్.వీరభద్రంను భూపాలపల్లి జిల్లాకు, ఆర్.అనితా రామకృష్ణను హనుమకొండ జిల్లాకు, కె.చంద్రశేఖర్‌ను వరంగల్ జిల్లాకు, డి.వీరభద్రప్రసాద్‌ను ములుగు జిల్లాకు ప్రభుత్వం అలాట్ చేసింది. మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్న సాదియాసుల్తానా, ఆర్.శారద, సీహెచ్.నాగరాజు, కె.కృష్ణవేణిని ఖమ్మంకు, ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న ఎం.శైలజ, ఎం.శ్వేతను మహబూబాబాద్ జిల్లాకు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న ఆర్.మంజులను వరంగల్ జిల్లాకు, పి.సుమన్‌ను పెద్దపల్లి జిల్లాకు, పి.శ్రీనివాస్‌ను మంచిర్యాల జిల్లాకు, ములుగు జిల్లాలో పనిచేస్తున్న కె.రవీందర్‌ను మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేసింది. మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్న జి.వివేక్, ఎం.ఇమ్మాన్యుయేల్, ఎన్.నాగభవాని, కె.స్వాతి బిందు, ఎం.అశోక్‌కుమార్, టి.సత్యనారాయణ, సీహెచ్.నరేశ్‌ను భద్రాద్రికొత్తగూడెం జిల్లాలకు కేటాయించింది. వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న జి.సదానందం ములుగు జిల్లాకు, జి.జగదీశ్వర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు, జనగామ జిల్లాలో పనిచేస్తున్న ఏకే మన్సూరిని సూర్యాపేట జిల్లాకు బదిలీ చేసింది.

## 'పిల్లల కిడ్నాప్ వదంతులను నమ్మొద్దు'

పోచమ్మమైదాన్/సుబేదారి, ఫిబ్రవరి 10 : ఇటీవల చిన్నారులను కిడ్నాప్ చేసే గ్యాంగులు తిరుగుతున్నాయని, పిల్లలకు చాక్లెట్లు, మత్తు పదార్థాలు ఇచ్చి కిడ్నాప్ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వదంతులను నమ్మవద్దని వరంగల్, హనుమకొండ ఏసీపీలు బోనాల కిషన్, కిరణ్‌కుమార్ వేర్వేరుగా ప్రకటనల్లో తెలిపారు. సోషల్ మీడియాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే, వారిని గుర్తించి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100 లేదా పోలీసు కంట్రోల్ రూం 8712685070 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడులు

### పోలీసుల అదుపులో 23మంది నిందితులు

గోవిందరావుపేట, ఫిబ్రవరి10 : మండలంలోని మొట్లగూడెం గ్రామ అటవీ సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరాలపై శనివారం సాయంత్రం దాడులు నిర్వహించినట్లు ఏఎస్పీ షేక్ మస్తాన్ తెలిపారు. అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున కోడి పందేలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. 30బైక్‌లతో పాటు రూ.23,457 నగదును స్వాధీనం చేసుకొని 23 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చెప్పారు. కాగా, మరి కొంతమంది పారిపోయారని తెలిపారు. అదుపులోకి తీసుకున్న 23 మందిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు చెప్పారు.

*పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు*